

పక్షవాతానికి, విటమిన్ బీ6కి సంబంధం.. యువతకు అలర్ట్!

నిప్పులాంటి నిజాల ప్రతిబింబం

నిలువుటద్దం

విలేకరులు కావలెను...

సంచలన దినపత్రిక నిలువుటద్దం కు - తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లాల వారీగా, మండలాల వారీగా పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్
9059548848

హైదరాబాద్. ఎడిటర్:- వై. రమ నాగరాజు సంపుటి:-32 సంచిక:-238 శుక్రవారం 30-10-2026

హసీనా దేశం వీడిన వీడియో వెనుక ఏం జరిగింది?

మాజీ సైనికాధికారి అనుమానాస్పద మృతితో కొత్త ప్రశ్నలు

- బంగ్లాదేశ్ మాజీ వైమానిక అధికారి తహసీఫ్ సౌరీ మృతదేహం తురాగ్ నదిలో లభ్యం
- అక్టోబర్ 27న కనిపించకుండా పోయిన 28 ఏళ్ల తహసీఫ్
- షేక్ హసీనా దేశం విడిచిన వీడియోతో అతడికి సంబంధం ఉందని ప్రచారం
- అతడిని హత్య చేశారని బంధువు ఆరోపణ
- వీడియోను తహసీఫ్ స్వయంగా చిత్రీకరించాడా అన్నది అధికారికంగా కాని నిర్ధారణ
- మృతదేహంపై బయటకు కనిపించే గాయాలు లేవని తెలిపిన పోలీసులు

బంగ్లాదేశ్‌లో సంచలనం రేపిన ఘటన వెలుగులోకి వచ్చింది. మాజీ ప్రధాని షేక్ హసీనా దేశం విడిచిపోతున్న వీడియోతో సంబంధం- మిగతా 2 లో

అర్నబ్ తుపాను ఎఫెక్ట్: సముద్రంలో చిక్కుకున్న భారీ కార్గో నౌక

- కేజీ బేసిన్‌లోని రవ్వా ఆయిల్ ఫీల్డ్ వద్ద నిలిచిపోయిన సిగ్మా పెరల్
- ఇంజిన్ ఫెయిల్యూర్ కావడమే ఘటనకు కారణంగా గుర్తింపు
- రంగంలోకి దిగిన కోస్ట్ గార్డ్.. సుజయ్ నౌకతో సహాయక చర్యలు

'అర్నబ్' తుపాను ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. ఈ తుపాను కారణంగా విశాఖపట్నం నుంచి సింగపూర్‌కు- మిగతా 2 లో

2లో

చంద్రబాబు విజ్ఞప్తికి తెలంగాణ సాయం

విద్యుత్ పునరుద్ధరణకు ఏపీకి 500 మంది సిబ్బంది

- తుపానుతో 16 వేలకు పైగా విద్యుత్ స్తంభాలు ధ్వంసం
- భట్టి విక్రమార్కతో మాట్లాడిన చంద్రబాబు, గొట్టిపాటి
- విద్యుత్ సరఫరాను త్వరగా పునరుద్ధరించడమే లక్ష్యం

హైదరాబాద్ | అక్టోబర్ 30

అర్నబ్ తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు తెలంగాణ ప్రభుత్వం అండగా నిలిచింది. తుపాను ధాటికి దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు సహకారం అందించాలన్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి పట్ల రేవంత్ రెడ్డి సర్కారు వెంటనే స్పందించింది. ఈ మేరకు ఏపీకి ప్రత్యేక

చంద్రబాబును మెచ్చుకున్న కేటీఆర్.. తెలంగాణ సర్కార్‌పై తీవ్ర విమర్శలు!

- కరవు పరిస్థితులను చంద్రబాబు గొప్పగా నిర్వహించారన్న కేటీఆర్
- అక్కడ లేని కరవు తెలంగాణలో ఎందుకుందని ప్రభుత్వంపై విమర్శ
- కొండా సురేఖ ఏం చెప్పారో పూర్తిగా చూడలేదని వెల్లడి

2లో

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందనలు కురిపించారు. తెలంగాణలో కరవు పరిస్థితులపై స్పందిస్తూ, పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రిని ఆయన ప్రశంసించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. తెలంగాణ కంటే ఏపీలో ఎక్కువ కరవు ఉన్నప్పటికీ, చంద్రబాబు పరిస్థితులను సమర్థవంతంగా నిర్వహించారని కేటీఆర్ అన్నారు. పక్క రాష్ట్రాలైన

బ్యాలెట్ ద్వారా బీజేపీకి బుల్లెట్ దింపాం

- ఆర్ఎస్ఎస్ హెడ్‌క్వార్టర్స్ నాగ్‌పూర్‌లోనే బీజేపీని ఓడించామన్న మహేశ్ గౌడ్
- మోదీ నియోజకవర్గం వారణాసిలోనూ బీజేపీ ఓటమి పాలైందని వెల్లడి
- ధైర్యముంటే మోదీ ప్రెస్ మీట్ పెట్టాలని సవాల్
- రాబోయే ఎన్నికల్లో బీజేపీకి వంద సీట్లు కూడా రావని జోస్యం- మిగతా 2 లో

రెబెల్స్ పై వెంటనే వేటు వేయండి

- పొత్తు ధర్మాన్ని తప్పనిసరిగా పాటించాల్సిందేనని సీఎం చంద్రబాబు స్పష్టీకరణ
- ఎన్డీఏ రెబల్ అభ్యర్థులను తక్షణమే సస్పెండ్ చేయాలని ఆదేశం
- అభ్యర్థులను కాకుండా ఎన్డీఏను చూసి ఓటేయాలని ప్రజలకు విజ్ఞప్తి- మిగతా 2 లో

రామ్‌లీలా మైదానానికి తరలిరండి విద్యార్థులకు రాహుల్ గాంధీ విజ్ఞప్తి

- ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని కాపాడేందుకే ఈ ఉద్యమం అని వెల్లడి
- ఇది ఏ ఒక్క పార్టీకి సంబంధించిన కార్యక్రమం కాదని స్పష్టం
- భయపడకుండా విద్యార్థులు తరలిరావాలని ప్రత్యేక విజ్ఞప్తి
- పోలీసులకు, లాఠీలకు భయపడొద్దని యువతకు ధైర్యం చెప్పిన రాహుల్

2లో

కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ దేశ ప్రజలకు కీలక పిలుపునిచ్చారు. నవంబర్ 1న న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న 'చలో ఢిల్లీ రామ్‌లీలా మార్చ్'కు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. దేశ ఆత్మను, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకే ఈ ఉద్యమమని,

అలాంటి నిరసనల్లో పాల్గొంటే ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హత

- యూపీ యోగి సర్కార్ నిర్ణయంపై ప్రతిపక్షాల ఫైర్
- యూపీలో ప్రభుత్వ ఉద్యోగాల వెరిఫికేషన్‌కు కొత్త నిబంధనలు
- హింసాత్మక అధికార మార్పిడి నిరసనలపై కఠిన వైఖరి
- రాజకీయ సిద్ధాంతాలే అనర్హతకు కారణం కావని వెల్లడి
- ఎఫ్ఐఆర్ నమోదైతేనే ఉద్యోగం నిరాకరించరని స్పష్టీకరణ
- పోలీసుల వెరిఫికేషన్ నివేదికకు 30 రోజుల గడువు

ఉత్తరప్రదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థుల వెరిఫికేషన్ విషయంలో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. హింసాత్మక మార్గాల్లో అధికార మార్పిడి లక్ష్యంగా పనిచేసే సంస్థల్లో సభ్యులుగా ఉండటం,- మిగతా 2 లో

గ్రావిటీతో నీళ్లిస్తే రాజీనామా చేస్తా: ప్రభుత్వానికి హరీశ్‌రావు సవాల్

పదవికి రాజీనామా చేస్తానని, ఒకవేళ నిరూపించలేకపోతే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాజీనామా చేస్తారా? అని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వానికి బహిరంగ సవాల్ విసిరారు. గ్రావిటీతో నీళ్లు వస్తాయని ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో నెలకొన్న కరవుకు ప్రభుత్వ వైఫల్యమే కారణమని హరీశ్ ఆరోపించారు. “ఇది కాలం తెచ్చిన కరవు కాదు. కాంగ్రెస్ తెచ్చిన కరవు” అని ఆయన వ్యాఖ్యానించారు. కృష్ణా, గోదావరిలో నీరు అందుబాటులో ఉన్నా ఎత్తిపోతలు చేపట్టకుండా ప్రభుత్వం రైతులను నష్టపరుస్తోందని విమర్శించారు. 33 శాతం వర్షపాతం లోటు ఉన్న ఏపీలో లేని క్రాప్ హాలిడే, కేవలం 17 శాతం లోటు ఉన్న తెలంగాణలో ఎందుకు ప్రకటించారని ప్రశ్నించారు. ప్రభుత్వం తక్షణమే మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతులు చేపట్టి, కన్నెపల్లి పంపుహౌస్ నుంచి నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి రూ.25 వేల కోట్లు ఖర్చు చేస్తామంటున్నారని, అసలు ఆ ప్రతిపాదనకు సంబంధించిన డీపీఆర్‌ను ఎందుకు బహిర్గతం చేయడం లేదని నిలదీశారు. తుమ్మిడిహెట్టి వద్ద తగినంత నీటి లభ్యత లేదని కేంద్ర జల సంఘం స్పష్టం చేసిన తర్వాతే, తమ ప్రభుత్వం మేడిగడ్డ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టిందని ఆయన గుర్తుచేశారు.

రాష్ట్రం పిచ్చోడి చేతిలో రాయిలా మారింది

విమర్శలు గుప్పించారు. గోదావరిలో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ, వాటిని ఎత్తిపోయకుండా ఉద్దేశపూర్వకంగానే రాష్ట్రంలో కరవు పరిస్థితులను సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం రైతులను వరి వేయవద్దని చెప్పడాన్ని తప్పుబట్టారు. “రాష్ట్రం ప్రస్తుతం పిచ్చోడి చేతిలో రాయిలా మారింది. ఏ ఒక్క వర్గానికీ న్యాయం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది” అని కేటీఆర్ మండిపడ్డారు. రోమ్ నగరం తగలబడుతుంటే చక్రవర్తి ఫిడేల్ వాయించినట్టుగా, రాష్ట్రంలో కరవు ఉంటే ప్రభుత్వం మూసీ సుందరీకరణ పనులకు టెండర్లు పిలుస్తోందని ఎద్దేవా చేశారు. మరో ఏడాదిన్నరలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని, ప్రజలు ఓపిక పట్టాలని కోరారు. అయితే కేటీఆర్ ఆరోపణలను కాంగ్రెస్ నేతలు ఖండించారు. కేటీఆర్ వి దొంగ కన్నీళ్లని, గోదావరి జలాలను వృథా చేయడం లేదని, ఇతర ఎత్తిపోతల పథకాల ద్వారా వినియోగిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద నీటిమట్టం తక్కువగా ఉన్నందున పంపులను నడపడం సాధ్యం కాదని వారు స్పష్టం చేశారు.

‘బ్రేకింగ్ బ్యాడ్’ తర్వాత ఇప్పుడు ‘ప్రిజన్ బ్రేక్’

విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆరోపిస్తూ, ప్రముఖ వెబ్ సిరీస్‌ల పేర్లతో విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ‘బ్రేకింగ్ బ్యాడ్’ తర్వాత ఇప్పుడు ‘ప్రిజన్ బ్రేక్’ మొదలైందని ఆయన ఎద్దేవా చేశారు. తేని జిల్లాలోని తెక్కంపట్టి సబ్ జైలు నుంచి నిన్న రాత్రి 17 మంది విచారణ ఖైదీలు పరారైన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ నేపథ్యంలో స్పందించిన స్టాలిన్... సీఎం విజయ్ పరిపాలన వైఫల్యంపై విమర్శలు చేశారు. “బ్రేకింగ్ బ్యాడ్ తర్వాత ఇప్పుడు తమిళనాడులో ప్రిజన్ బ్రేక్ కూడా మొదలైంది. బెయిల్‌పై బయటకు వచ్చిన వారినే పర్యవేక్షించడం లేదనుకున్నా. కానీ ఈ చేతకాని ప్రభుత్వ హయాంలో జైళ్లలో ఉన్న ఖైదీలు కూడా సులభంగా తప్పించుకుంటున్నారు” అని ఆయన వ్యాఖ్యానించారు. 1995 తర్వాత ఇంత పెద్ద సంఖ్యలో ఖైదీలు తప్పించుకోవడం ఇదే మొదటిసారని స్టాలిన్ గుర్తుచేశారు. ఈ ప్రభుత్వం ప్రజలను రక్షించలేదని, ప్రజలకు స్వీయరక్షణే శరణ్యమని ఆయన అన్నారు. ఇటీవల టీవీకే పార్టీ నేత ఒకరు నార్కోటిక్స్ కేసులో పట్టుబడినప్పుడు స్టాలిన్ ఆ పార్టీని ‘బ్రేకింగ్ బ్యాడ్ పార్టీ’ అని విమర్శించిన విషయం తెలిసిందే. తేని జైలు ఘటనలో, ఓ ఖైదీకి మూర్ఛ వచ్చిందని నమ్మించిన ఖైదీలు, సెల్‌లోకి వచ్చిన గార్డులపై దాడి చేసి పరారయ్యారు. ఈ ఘటన తర్వాత అప్రమత్తమైన పోలీసులు, పరారైన వారిని పట్టుకోవడానికి 17 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు నలుగురు ఖైదీలను తిరిగి అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనకు బాధ్యులుగా తొమ్మిది మంది జైలు సిబ్బందిని సస్పెండ్ చేశారు. ముఖ్యమంత్రి విజయ్ వద్దే హోం శాఖ ఉండటంతో, విపక్షాల విమర్శలకు ఆయన నేరుగా సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కాకినాడకు 167 కి.మీ. దూరంలో ‘అర్ణబ్ అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం

ఆరు గంటలుగా గంటకు 23 కిలోమీటర్ల వేగంతో తీరం వైపు దూసుకొస్తోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాలపై తుపాను ప్రభావం, భారీ వర్షాల హెచ్చరికల గురించి సీఎం వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమీక్ష అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు తుఫాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడటమే ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో బాధితులకు అవసరమైన ఆహారం, తాగునీరు, ఇతర సౌకర్యాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. తుపాను ప్రభావంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలని, ఈదురు గాలులకు చెట్లు, హోర్డింగులు కూలిపోతే తక్షణమే తొలగించి రవాణాకు ఆటంకాలు లేకుండా చూడాలని సీఎం ఆదేశించారు. సహాయక చర్యల కోసం సిద్ధంగా ఉన్న ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బలగాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లాల్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ల ద్వారా క్షేత్రస్థాయి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, తక్షణమే స్పందించాలని కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

పులివెందులలో వైసీపీకి ఎదురుదెబ్బ టీడీపీలోకి 20 కుటుంబాలు

మొదటిపేజీ తరువాయి - జగన్ సొంత గడ్డ పులివెందులకు చెందిన 20 వైసీపీ కుటుంబాలు ఈరోజు తెలుగుదేశం పార్టీలో చేరాయి. పులివెందుల టీడీపీ ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి వారికి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ... టీడీపీ విధానాలు, కార్యక్రమాలకు ఆకర్షితులై నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో యువత పార్టీలో చేరుతున్నారని అన్నారు. ఎన్నికలకు కేవలం కొన్ని రోజుల సమయం మాత్రమే ఉన్నప్పటికీ, పులివెందులలోని ప్రతి వార్డులో ప్రజలు టీడీపీ వైపు మొగ్గు చూపుతున్నారని, మద్దతుదారుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోందని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా బరిలో ఉన్న గీతా కుమారి భారీ మెజారిటీతో గెలుపొందడం ఖాయమని బీటెక్ రవి ధీమా వ్యక్తం చేశారు. కీలకమైన ఎన్నికల సమయంలో ఈ చేరికలు జరగడం నియోజకవర్గంలో రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

అలాంటి నిరసనల్లో పాల్గొంటే ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హత

మొదటిపేజీ తరువాయి - అలాంటి కార్యకలాపాల్లో పాల్గొనడం ఉద్యోగానికి అనర్హతగా మారవచ్చని స్పష్టం చేసింది. అయితే రాజకీయ సిద్ధాంతాలు వేరుగా ఉన్నాయనే కారణంతోనే ఉద్యోగం నిరాకరించరాదని కూడా పేర్కొంది. ఈ నిర్ణయంపై సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ విమర్శలు చేశాయి.

కొత్త నిబంధనల్లో ఏముంది?

రాష్ట్ర ప్రభుత్వ శాఖలతో పాటు ప్రభుత్వ సంస్థలు, మండళ్లు, స్థానిక సంస్థల్లో నేరుగా నియామకాలు పొందే అభ్యర్థులకు ఈ మార్గదర్శకాలు వర్తిస్తాయి. హింసాత్మక పద్ధతుల్లో ప్రస్తుత వ్యవస్థను మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్న సంస్థల్లో సభ్యత్వం ఉండటం లేదా అలాంటి కార్యకలాపాల్లో పాల్గొనడం అనర్హతకు కారణం కావచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అభ్యర్థికి 21 ఏళ్లు నిండిన తర్వాత, వెరిఫికేషన్‌కు ముందు మూడేళ్ల వ్యవధిలో ఇలాంటి కార్యకలాపాల్లో పాల్గొన్నట్లు తేలితే, ఆ వ్యక్తి ఇంకా వాటిలో చురుగ్గా ఉన్నట్లు పరిగణించే అవకాశం ఉంది. అయితే ఈ మధ్య కాలంలో అతడి ప్రవర్తనలో సానుకూల మార్పు వచ్చినట్లు ఆధారాలు ఉంటే ఆ నిర్ణయాన్ని పునఃపరిశీలించవచ్చు. కేవలం ఎఫ్ఐఆర్ నమోదైనంత మాత్రాన లేదా దర్యాప్తు కొనసాగుతున్నంత మాత్రాన అభ్యర్థిని ఉద్యోగానికి అనర్హుడిగా ప్రకటించరాదు. కేసుల్లో నిర్దోషిగా తేలినవారు, రాజీ ద్వారా పరిష్కారమైన కేసులు ఉన్నవారు, బాలల న్యాయ చట్టం పరిధిలోకి వచ్చే అంశాలు ఉన్నవారికి కూడా ఆటోమేటిక్‌గా అనర్హత వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

ప్రభుత్వంపై ప్రతిపక్షాల విమర్శలు

ఈ ఉత్తర్వులను సమాజ్‌వాదీ పార్టీ నేత ఉదయ్‌వీర్ బ్రిటిష్ పాలన కాలం నాటి విధానాలతో పోల్చారు. స్వతంత్ర భారతదేశంలో నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించిందని, ఎన్నికల ద్వారా అధికార మార్పిడి ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగమని అన్నారు. కాంగ్రెస్ నేత రషీద్ అల్వీ ఈ నిర్ణయాన్ని అతిగా ఉందని విమర్శించారు. ఇలాంటి అంశాల్లో ప్రభుత్వమే న్యాయనిర్ణేతగా వ్యవహరించడం సరైంది కాదని వ్యాఖ్యానించారు.

వెరిఫికేషన్‌కు 30 రోజుల గడువు

పోలీసులు, స్థానిక నిఘా విభాగం (ఎల్ఐయూ) అభ్యర్థుల క్యారెక్టర్ వెరిఫికేషన్ నివేదికలను అభ్యర్థన అందిన 30 రోజుల్లోగా నియామక అధికారులకు సమర్పించాలి. నివేదిక ఆలస్యమైనంత మాత్రాన నియామక పత్రం ఇవ్వడం ఆపాల్సిన అవసరం లేదని ప్రభుత్వం తెలిపింది. అవసరమైన పత్రాలు, స్వీయ ధ్రువీకరణ తీసుకున్న తర్వాత తాత్కాలిక నియామక పత్రం ఇవ్వవచ్చు.

హసీనా దేశం వీడిన వీడియో వెనుక ఏం జరిగింది?

మొదటిపేజీ తరువాయి - ఉందని ప్రచారంలోకి వచ్చిన మాజీ వైమానిక దళ అధికారి కేఎం తహసీఫ్ సారీ (28) నదిలో శవమై కనిపించాడు. ఢాకాలోని తురాగ్ నదిలో బుధవారం అతడి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. అంతకుముందు రోజు అతడు కనిపించకుండా పోయాడు. ఈ మరణం వెనుక అనుమానాలున్నాయని అతడి బంధువులు ఆరోపించడంతో ఈ ఘటన తీవ్ర చర్చకు దారితీసింది. అయితే, అతడిది హత్యా? ప్రమాదవశాత్తూ మునిగిపోయాడా? అన్నది ఇంకా తేలలేదు.

హసీనా దేశం విడిచిన వీడియోతో సంబంధం ఏంటి?

2024 ఆగస్టు 5న బంగ్లాదేశ్‌లో ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు తీవ్రరూపం దాల్చడంతో అప్పటి ప్రధాని షేక్ హసీనా పదవికి రాజీనామా చేసి దేశం విడిచివెళ్లారు. ఆమె సైనిక విమానంలో బయలుదేరిన దృశ్యాలు అప్పట్లో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారంలోకి వచ్చాయి. ఆ వీడియోను చిత్రీకరించిన వ్యక్తిగా తహసీఫ్ పేరు తెరపైకి వచ్చింది. అయితే, అతడే వీడియో తీశాడా? లేక వేరొకరు చిత్రీకరించిన దాన్ని మాత్రమే షేర్ చేశాడా? అనే విషయంలో అధికారిక నిర్ధారణ లేదు.

‘నా సోదరుడిని చంపేశారు’.. బంధువు సంచలన ఆరోపణలు

తహసీఫ్ మరణంపై అతడి బంధువు మోష్ఫెకా జహాన్ తీవ్ర ఆరోపణలు చేశారు. హసీనా దేశం విడిచిన వీడియోను షేర్ చేసిన కారణంగా తహసీఫ్ వేధింపులకు గురయ్యాడని, చివరకు అతడిని హత్య చేశారని ఆమె సోషల్ మీడియాలో పేర్కొన్నారు. వీడియోను అతడు స్వయంగా చిత్రీకరించలేదని, మరో అధికారి తీసిన దాన్ని పౌరుడిగా షేర్ చేశాడని ఆమె పేర్కొన్నారు. వైమానిక దళం నుంచి పదవీ విరమణ చేసిన తర్వాత కూడా అతడిని నిఘా అధికారులు అనుసరిస్తున్నారని, మానసిక వేధింపులు కొనసాగాయని ఆమె పేర్కొన్నారు.

నదిలో ఎలా కనిపించాడు?

పోలీసుల సమాచారం ప్రకారం.. తహసీఫ్ మృతదేహం ఢాకాలోని ఉత్తరఖాన్ ప్రాంతం సమీపంలో తురాగ్ నదిలో లభించింది. అతడి జేబులో ఉన్న ఐఫోన్ ఆధారంగా గుర్తింపును నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఢాకాలోని షహీద్ సుహ్రావర్ది మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక పరిశీలనలో శరీరంపై బయటకు కనిపించే గాయాలు లేవని పోలీసులు తెలిపారు. తొలుత నీటిలో మునిగిపోవడం మరణానికి కారణమై ఉండవచ్చని అనుమానించినప్పటికీ, అసలు కారణం పోస్టుమార్టం నివేదిక తర్వాతే తెలుస్తుందని స్పష్టం చేశారు. బంగ్లాదేశ్ హోంమంత్రి సలాహుద్దీన్ అహ్మద్ కూడా విచారణ, పోస్టుమార్టం వివరాలు వచ్చిన తర్వాతే ఈ ఘటనపై మాట్లాడతామని తెలిపారు.

వైమానిక దళం నుంచి ఎందుకు వైదొలిగాడు?

తహసీఫ్ వైమానిక దళం నుంచి పదవీ విరమణ చేసిన అంశం కూడా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. హసీనా దేశం విడిచిన వీడియో వివాదంతో అతడి వైదొలగడానికి సంబంధం ఉందంటూ గతంలో ప్రచారం జరిగింది. అయితే, బంగ్లాదేశ్ సైనిక ప్రజాసంబంధాల విభాగం గతంలో విడుదల చేసిన ప్రకటనలో అతడి పదవీ విరమణ నిబంధనల ప్రకారం జరిగిందని, ఇతర ఆరోపణలతో సంబంధం లేదని పేర్కొంది. ప్రస్తుతం తహసీఫ్ మరణానికి గల కారణం, ఇందులో ఇతరుల ప్రమేయం ఉందా అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. కుటుంబ సభ్యుల ఆరోపణలు నిజమా కాదా అన్నది దర్యాప్తులో తేలాల్సిందే. పోస్టుమార్టం నివేదిక, పోలీసుల తదుపరి విచారణ ఈ కేసులో కీలకం కానున్నాయి.

అర్నబ్ తుపాను ఎఫెక్ట్: సముద్రంలో చిక్కుకున్న భారీ కార్గో నౌక

మొదటిపేజీ తరువాయి - వెళ్తున్న ఒక భారీ కార్గో నౌక సముద్రంలో చిక్కుకుపోయింది. ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో ఆ నౌక ముందుకు కదలలేని స్థితిలో నిలిచిపోయింది. వివరాల్లోకి వెళితే.. మార్షల్ ఐలాండ్స్‌కు చెందిన ‘సిగ్మా పెరల్’ అనే కార్గో నౌక విశాఖ పోర్టులో సరుకును అన్‌లోడ్ చేసిన అనంతరం సింగపూర్‌కు బయలుదేరింది. మార్గమధ్యంలో కేజీ బేసిన్‌లోని రవ్వా ఆయిల్ ఫీల్డ్ సమీపానికి చేరుకోగానే, తుపాను ప్రభావంతో ఎగిసిపడుతున్న భీకరమైన అలల ధాటికి నౌక ఇంజిన్ ఆగిపోయింది. దీంతో అప్రమత్తమైన సిబ్బంది వెంటనే అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న భారత తీర రక్షక దళం (కోస్ట్ గార్డ్) అధికారులు తక్షణమే సహాయక చర్యలు ప్రారంభించారు. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు కేంద్రంగా ఈ ఆపరేషన్‌ను పర్యవేక్షిస్తున్నారు. నౌకలో చిక్కుకున్న సిబ్బందిని రక్షించేందుకు ‘సుజయ్’ అనే కోస్ట్ గార్డ్ నౌకను ఘటనా స్థలానికి పంపించారు. ప్రస్తుతం సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

చంద్రబాబు విజ్ఞప్తికి వెంటనే స్పందించిన తెలంగాణ ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి - బృందాలను పంపింది. అర్నబ్ తుపాను ప్రభావంతో అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం సహా పలు ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో విద్యుత్ మౌలిక సదుపాయాలు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం, సుమారు 16,000లకు పైగా విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో వందలాది గ్రామాల్లో అంధకారం నెలకొంది. ఈ నేపథ్యంలో, విద్యుత్ సరఫరాను త్వరితగతిన పునరుద్ధరించేందుకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్.. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో ఫోన్‌లో మాట్లాడి సహాయం కోరారు. ఏపీ సీఎం చంద్రబాబు విజ్ఞప్తిపై భట్టి విక్రమార్క వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించారు. ఆయన సానుకూలంగా స్పందించడంతో అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 500 మంది సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాలను ఏపీకి పంపేందుకు ఏర్పాట్లు చేశారు. టీజీఎస్పీడీసీఎల్ నేతృత్వంలోని ఈ బృందాలు ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌కు బయలుదేరి, కూలిపోయిన స్తంభాలు, తెగిపడిన తీగల మరమ్మతు పనుల్లో పాల్గొంటున్నాయి. ప్రస్తుతం ఏపీలో 1,700 మంది స్థానిక సిబ్బంది పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమవ్వగా, మరో 500 మందిని ఇతర డిస్కంల నుంచి రప్పిస్తున్నారు. వీరికి తోడుగా తెలంగాణ సిబ్బంది కూడా చేరడంతో పనులు వేగవంతమయ్యాయి. వీలైనంత త్వరగా, వీలైతే 24 గంటల్లోనే విద్యుత్ సరఫరాను సాధారణ స్థితికి తీసుకురావడమే లక్ష్యంగా ఇరు రాష్ట్రాల సిబ్బంది కలిసికట్టుగా పనిచేస్తున్నారు.

చంద్రబాబును మెచ్చుకున్న కేటీఆర్.. తెలంగాణ సర్కార్‌పై తీవ్ర విమర్శలు!

మొదటిపేజీ తరువాయి - ఏపీ, కర్ణాటకలో లేని కరవు తెలంగాణలోనే ఎందుకు వచ్చిందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇది ‘30 శాతం కమీషన్ సర్కార్’ అని రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు చేశారని కూడా తెలిపారు. ఇదే సమయంలో, గతంలో తనపై చేసిన వ్యాఖ్యలకు మాజీ మంత్రి కొండా సురేఖ క్షమాపణ చెప్పడంపై కేటీఆర్ స్పందించారు.

‘నిజం నిలకడ మీద తెలుతుంది’ అని వ్యాఖ్యానించారు. కొండా సురేఖ ఏం చెప్పారో ఇంకా పూర్తిగా చూడలేదని, ఆ వివరాలు చూశాక లీగల్ టీమ్‌తో చర్చించి తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఇటీవల ఒక పత్రిక కూడా క్షమాపణ చెప్పిందని గుర్తుచేశారు. మున్ముందు తనపై ఫార్ములా–ఈ రేస్, విద్యుత్ కుంభకోణం వంటి తప్పుడు ఆరోపణలు చేసిన ప్రతి ఒక్కరూ పశ్చాత్తాపంతో క్షమాపణలు చెప్పక తప్పదని ఆయన అన్నారు. కాగా, అంతకుముందు మంత్రి కొండా సురేఖ ఎక్స్ వేదికగా కేటీఆర్‌కు బహిరంగ క్షమాపణలు చెప్పారు. అప్పటి రాజకీయ పరిస్థితుల్లో భాగంగా, ప్రతిపక్షాన్ని విమర్శించే క్రమంలోనే ఆ వ్యాఖ్యలు చేయాల్సి వచ్చిందని, కేటీఆర్‌ను వ్యక్తిగతంగా బాధపెట్టే ఉద్దేశం తనకు లేదని ఆమె స్పష్టం చేశారు.

బ్యాలెట్ ద్వారా బీజేపీకి బుల్లెట్ దింపాం

“ఎన్ని గెలిచామన్నది కాదు, ఎక్కడ గెలిచామన్నది ముఖ్యం. బీజేపీ అబ్బ అయిన ఆర్ఎస్ఎస్ హెడ్‌క్వార్టర్స్‌లోనే బీజేపీని ఓడించి, బ్యాలెట్ ద్వారా బుల్లెట్ దింపాం” అని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై ఆయన గురువారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ నియోజకవర్గమైన వారణాసి, ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయం ఉన్న నాగ్‌పూర్‌లలో బీజేపీ ఓటమిని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. నాగ్‌పూర్ పట్టభద్రుల నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి అభిజిత్ వంజారి, బీజేపీ అభ్యర్థి సుధాకర్ కోహ్లేపై 3,271 ఓట్ల తేడాతో విజయం సాధించారని మహేశ్ గౌడ్ గుర్తుచేశారు. బీజేపీకి కంచుకోటలాంటి, కేంద్ర మంత్రి గడ్కరీ, ఫడ్నవీస్ వంటి నేతలు ప్రచారం చేసిన నాగ్‌పూర్‌లో కాంగ్రెస్ గెలవడం సాధారణ విషయం కాదన్నారు. ఇది బీజేపీ సిద్ధాంతాన్ని అక్కడి విద్యావంతులు, యువత తిరస్కరించడానికి నిదర్శనమని పేర్కొన్నారు. వారణాసిలో ఓటమి మోదీ పాలనపై

ప్రజా వ్యతిరేకతను సూచిస్తోందని, ఈ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ మోదీ తన వైఫల్యాలను అంగీకరించాలని డిమాండ్ చేశారు. ధైర్యముంటే ఈ ఫలితాలపై మోదీ ప్రెస్ మీట్ పెట్టాలని, గత 12 ఏళ్లుగా ఒక్క మీడియా సమావేశం కూడా నిర్వహించని ప్రధాని కేవలం ట్వీట్లకు పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఓడిపోతే ప్రభుత్వ వ్యతిరేకత అనే బీజేపీ, వారణాసిలో ఓటమిని ఎందుకు మోదీకి వ్యతిరేకంగా చూడదని ప్రశ్నించారు. లక్నో నుంచి పట్నా వరకు బీజేపీకి ఎదురుదెబ్బలు తగులుతున్నాయని, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ సొంత ప్రాంతమైన గోరఖ్‌పూర్‌లో కేవలం 307 ఓట్ల మెజారిటీతో గెలవడమే దీనికి నిదర్శనమని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీకి మూడంకెల సీట్లు కూడా రావని జోస్యం చెప్పారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో బీజేపీయేతర శక్తులకు ప్రజా మద్దతు పెరుగుతోందని, ఆయనే తదుపరి ప్రధాని అవుతారని విశ్వాసం వ్యక్తం చేశారు. ‘ఓట్ల దొంగతనం’ను నిరసిస్తూ నవంబర్ 1న ఢిల్లీలో భారీ నిరసన చేపట్టనున్నామని, జాబితా నుంచి తొలగించిన 13.3 కోట్ల ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

రామ్‌లీలా మైదానానికి తరలిరండి.. విద్యార్థులకు రాహుల్ గాంధీ విజ్ఞప్తి

మొదటిపేజీ తరువాయి - నవంబర్ 1న న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న ‘చలో ఢిల్లీ రామ్‌లీలా మార్చ్’కు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ మేరకు ఆయన ‘ఎక్స్’ వేదికగా ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. దేశ ఆత్మను, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకే ఈ ఉద్యమమని, ఓట్ల దొంగతనాన్ని

అడ్డుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఏ ఒక్క రాజకీయ పార్టీకి మాత్రమే పరిమితం కాదని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, ఎన్నికల కమిషన్ వైఖరితో విభేదించే ప్రతి ఒక్కరూ, ప్రజాస్వామ్యాన్ని కాంక్షించే పౌరులందరూ ఈ మార్చ్‌లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. “మీ భావ ప్రకటనా స్వేచ్ఛ, ఆలోచనలు, జీవన విధానంపై దాడి జరుగుతోందని మీరు భావిస్తే, ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేకుండా ఈ మార్చ్‌కు తరలిరండి. పోలీసులకు, లాఠీలకు భయపడవద్దు. బీజేపీ ప్రభుత్వం అణచివేత చర్యలకు పాల్పడే సాహసం చేయదు” అని విద్యార్థులకు భరోసా ఇచ్చారు. దేశవ్యాప్తంగా వేలాది మంది ఈ కార్యక్రమంలో పాల్గొని, దీనిని విజయవంతం చేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

రెబెల్స్ పై వెంటనే వేటు వేయండి

మొదటిపేజీ తరువాయి - పొత్తు ధర్మాన్ని ఎలాంటి పునరాలోచన లేకుండా పాటించాల్సిందేనని, ఎన్డీఏ కూటమికి వ్యతిరేకంగా పోటీ చేస్తున్న రెబల్ అభ్యర్థులను తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈరోజు జరిగిన ఆంధ్రప్రదేశ్ కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై

విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... తాను, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ కలిసి ఎంతో శ్రమించి సీట్ల సర్దుబాటు పూర్తి చేశామని తెలిపారు. ప్రజలు, కార్యకర్తలు, నేతలకు దీనిపై సానుకూల సందేశం పంపామని, కాబట్టి ఓటర్లు అభ్యర్థులను కాకుండా ఎన్డీఏ కూటమిని చూసి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. గత రెండున్నరేళ్లుగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి మద్దతు లభిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ చర్చలో జోక్యం చేసుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ముగ్గురు నేతలు కలిసికట్టుగా తీసుకున్న నిర్ణయంపై ప్రజలు, కార్యకర్తల నుంచి సానుకూల స్పందన వచ్చిందని అన్నారు. మంత్రులు కేవలం తమ నియోజకవర్గాలపైనే కాకుండా, వారికి ఇన్‌ఛార్జ్‌గా ఉన్న జిల్లాల బాధ్యతలను కూడా తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఎన్డీఏ అభ్యర్థుల గెలుపు బాధ్యత మంత్రులదేనని తేల్చిచెప్పారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల తర్వాత పంచాయతీ, సొసైటీ ఎన్నికలు వస్తాయని, వాటికి ఇప్పటినుంచే సిద్ధం కావాలని సూచించారు. ఈ ఎన్నికల్లో ఏవైనా వివాదాలు తలెత్తితే వెంటనే పరిష్కరించాలని, ఆ తర్వాత ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

కేటీఆర్ పాస్‌పోర్ట్ వివాదం.. యథాతథ స్థితి కొనసాగించాలన్న హైకోర్టు

మొదటిపేజీ తరువాయి - ఆయన పాస్‌పోర్ట్‌కు సంబంధించి జారీ అయిన నోటీసుల విషయంలో యథాతథ స్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఫార్ములా ఈ కేసులో విచారణ జరుపుతున్న అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ), కేటీఆర్ పాస్‌పోర్ట్‌ను స్వాధీనం చేసుకోవాలని కోరుతూ ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయానికి (ఆర్‌పీవో) లేఖ రాసింది. ఏసీబీ అభ్యర్థన మేరకు పాస్‌పోర్ట్ అధికారులు కేటీఆర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులను సవాలు చేస్తూ కేటీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం, పాస్‌పోర్ట్ నోటీసుల ప్రక్రియలో యథాతథ స్థితిని పాటించాలని ఆదేశించింది. ప్రతివాదులుగా ఉన్న ఏసీబీ, పాస్‌పోర్ట్ అధికారులకు నోటీసులు జారీ చేస్తూ, వారి వాదనలను కౌంటర్ అఫిడవిట్ రూపంలో సమర్పించాలని సూచించింది. అనంతరం, కేసు తదుపరి విచారణను నవంబర్ 6వ తేదీకి వాయిదా వేసింది. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులతో కేటీఆర్ పాస్‌పోర్ట్‌ను స్వాధీనం చేసుకునే ప్రక్రియకు ప్రస్తుతానికి అడ్డుకట్ట పడినట్లయింది.

నిప్పులాంటి నిజాల ప్రతిబింబం
నిలువుటద్దం
శుక్రవారం 30-10-2026

చిన్నారుల సంక్షేమమే లక్ష్యం.. అంగన్‌వాడీ అభివృద్ధికి వడ్డేపల్లి రాజేశ్వరరావు చేయూత!

జనతా నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రత్యేక పూజలు.. చిన్నారులతో ఆప్యాయంగా గడిపిన బీజేపీ నేత........

మూసాపేట్, అక్టోబర్ 29 (నిలువుటద్దం ప్రతినిధి): చిన్నారుల సంక్షేమం, విద్యాభివృద్ధి, మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు తన వంతు సహకారం అందించారు. మూసాపేట్ డివిజన్ పరిధిలోని జనతా నగర్‌లో గత వారం పర్యటించిన ఆయన, స్థానిక అంగన్‌వాడీ కేంద్ర టీచర్ విజ్ఞప్తి మేరకు కేంద్రం అభివృద్ధి పనులతో పాటు చిన్నారుల సౌకర్యార్థం శౌచాలయ నిర్మాణానికి సహకారం అందించారు.

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న రాజేశ్వరరావు

అంగన్‌వాడీ కేంద్ర అభివృద్ధికి సహకరించిన రాజేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, స్థానిక బీజేపీ నాయకులు, అంగన్‌వాడీ టీచర్ ఆధ్వర్యంలో ఈరోజు ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రాజేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక మాజీ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్‌తో కలిసి అంగన్‌వాడీ చిన్నారులను ఆప్యాయంగా పలకరించారు. వారితో కొద్దిసేపు సరదాగా గడుపుతూ చిన్నారుల్లో ఆనందాన్ని నింపారు.

చిన్నారుల భవిష్యత్తుకు భరోసా

చిన్నారుల ఆరోగ్యం, భద్రత, విద్యాభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు కీలకమని, వాటిలో మెరుగైన సదుపాయాలు కల్పించడం ఎంతో అవసరమని స్థానికులు పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్ర అభివృద్ధికి, చిన్నారుల సౌకర్యార్థం శౌచాలయ నిర్మాణానికి సహకారం అందించిన రాజేశ్వరరావుపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మూసాపేట్, ఖైతలాపూర్ డివిజన్లకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

సేవే లక్ష్యం.. ప్రజా సంక్షేమమే ధ్యేయం!

విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు

అల్లాదుర్గం , నిలువుటద్దం ప్రతినిధి: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని , బాల బాలికల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించి లైంగిక నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అల్లాదుర్గం జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి సుచరిత తెలిపారు. సురక్షిత్ బచ్పన్ అభియాన్ లో భాగంగా గురువారం మండల పరిధిలోని గడి పెద్దాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు బాలల హక్కులు, భద్రత, రక్షణ, సంక్షేమంపై అవగాహన ఉండాలని సూచించారు. బాల బాలికలు భయం లేకుండా సురక్షిత వాతావరణంలో జీవించడంతోపాటు బాగా కష్టపడి చదివి తల్లిదండ్రులకు, దేశానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. బాలల భద్రత కేవలం తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు, విద్య సంస్థలు, సమాజంలో ప్రతి ఒక్కరు బాధ్యతని స్పష్టం చేశారు. బాలల హక్కులను గౌరవిస్తూ వారికి సురక్షితమైన, ఆహ్లాదకరమైన విద్య అందించేందుకు అందరు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పట్టుదలతో చదివి ఉన్నత లక్షలు చేరుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మణ్, ప్రధానోపాధ్యాయులు నర్సింలు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బాలల భద్రతపై పాఠశాలల్లో అవగాహన

సంగారెడ్డి జిల్లాలో సురక్షిత్ బచ్పన్ అభియాన్ కార్యక్రమాలు

సంగారెడ్డి, నిలువుటద్దం ప్రతినిధి: బాలల హక్కుల పరిరక్షణ, వ్యక్తిగత భద్రత, బాలలపై జరిగే నేరాల నివారణ లక్ష్యంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని పలు పాఠశాలల్లో సురక్షిత్ బచ్పన్ అభియాన్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారులు విద్యార్థులకు గుడ్ టచ్--బ్యాడ్ టచ్, పోక్సో చట్టం, ఆన్‌లైన్ భద్రత, బాలల హక్కులపై అవగాహన కల్పించారు పోక్సో అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి శ్రీలేఖ కంది జెడ్పీహెచ్‌ఎస్‌లో, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి డి.వి.ఆర్. తేజో కార్తీక్ మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాల, సంగారెడ్డి హైస్కూల్‌లో కార్యక్రమాలు నిర్వహించారు. అదనపు సీనియర్ సివిల్ జడ్జి దీప్తి డాఫోడిల్స్ హైస్కూల్‌లో, అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ధనలక్ష్మి అక్షర పాఠశాలలో, ప్రత్యేక మొబైల్ కోర్టు న్యాయమూర్తి టి. దుర్గారాణి ఢిల్లీ సెకండరీ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలలు ఎలాంటి వేధింపులకు గురైనా భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని న్యాయాధికారులు సూచించారు. ప్రతి బాలుడికి, బాలికకు సురక్షితమైన వాతావరణం కల్పించడం అందరి బాధ్యతని పేర్కొన్నారు. బాలల భద్రత, సంక్షేమం కోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసు శాఖ, విద్యాసంస్థలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

సింధు ఆదర్శ్ రెడ్డి చొరవ..సర్కారు బడికి ఆధునిక హంగులు

– ఎల్ఐజీ కాలనీ ఎంపీపీఎస్‌కు కొత్త రూపు

– సేల్స్‌ఫోర్స్, నిర్మాణ్ సంస్థల సహకారంతో పాఠశాల అభివృద్ధి

రామచంద్రాపురం, అక్టోబర్ 29(నిలువుటద్దం న్యూస్): భారతీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి చొరవతో ఎల్ఐజీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు మహర్దశ పట్టింది. సేల్స్‌ఫోర్స్ కంపెనీ, నిర్మాణ్ సంస్థల సహకారంతో పాఠశాలను ఆధునీకరించి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించారు. పాఠశాలలో విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఇందులో భాగంగా ప్లంబింగ్, ఎలక్ట్రికల్ పనులు, పెయింటింగ్, లీకేజీల మరమ్మతులు, ఫ్లోరింగ్ పనులు పూర్తి చేశారు. చిన్నారుల కోసం ఆకర్షణీయమైన ఆర్ట్ వర్క్‌తో పాటు ఆట పరికరాలను కూడా ఏర్పాటు చేశారు. పాఠశాల అభివృద్ధి పనులను సింధు ఆదర్శ్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు ఉపయోగపడేలా పనులను నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించడం ద్వారా విద్యార్థులకు ఆహ్లాదకరమైన విద్యా వాతావరణం అందించవచ్చని ఈ సందర్భంగా పేర్కొన్నారు. పాఠశాల ఆధునీకరణకు సహకరించిన సేల్స్‌ఫోర్స్ ప్రతినిధి పాండురంగారావుకు, నిర్మాణ్ సంస్థ సభ్యులు నికీ, సౌమ్యలకు సింధు ఆదర్శ్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శౌర్య, రాజకుమారి, ఎల్ఐజీ కాలనీ అధ్యక్షుడు యాదగిరి రెడ్డి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యలపై గళమెత్తిన రాజేశ్వరరావు.. అభివృద్ధికి భరోసా!

ఆంజనేయ నగర్ అభివృద్ధికి అండగా ఉంటా.. సమస్యల పరిష్కారమే లక్ష్యం!

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకారం.. ప్రజలకు అందుబాటులో ఉంటానని హామీ.......

కూకట్‌పల్లి, అక్టోబర్ 29 (నిలువుటద్దం ప్రతినిధి): కాలనీల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు స్పష్టం చేశారు. ఖైతలాపూర్ డివిజన్ పరిధిలోని ఆంజనేయ నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు గురువారం ఆయన కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక బీజేపీ నాయకులు, కాలనీవాసులు ఆయనకు ఘనస్వాగతం పలికారు.

కాలనీవాసులతో ముఖాముఖి.. సమస్యలపై ఆరా!

అనంతరం కాలనీ సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలతో సమావేశమైన రాజేశ్వరరావు కాలనీలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకారంపై కృతజ్ఞతలు

కాలనీలో భద్రతను మెరుగుపరిచే లక్ష్యంతో సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన రాజేశ్వరరావుకు కాలనీ సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజల భద్రతకు, కాలనీ అభివృద్ధికి ఆయన అందిస్తున్న సహకారాన్ని అభినందించారు.

ఎవరో వస్తారని ఎదురుచూడొద్దు.. మనమూ ముందడుగు వేయాలి!

ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ, కాలనీ సమస్యల పరిష్కారం కోసం ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురుచూడకుండా ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ముందుకు రావాలని సూచించారు. ఆంజనేయ నగర్ కాలనీ అభివృద్ధికి తన వంతు సహకారాన్ని నిరంతరం అందిస్తానని తెలిపారు.ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, కాలనీల అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని రాజేశ్వరరావు స్పష్టం చేశారు.

అల్లాపూర్‌లో సమస్యలపై ఎమ్మెల్యే ఆగ్రహం అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఆదేశం!

డ్రైనేజీ పనుల్లో జాప్యంపై అసహనం.. సున్నం చెరువు అభివృద్ధి త్వరగా పూర్తి చేయాలని సూచన.......

కూకట్‌పల్లి, అక్టోబర్ 29 (నిలువుటద్దం ప్రతినిధి): అల్లాపూర్ డివిజన్‌లో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించి, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులను ఆదేశించారు. గురువారం అల్లాపూర్ డివిజన్‌లో పర్యటించిన ఆయన డ్రైనేజీ సమస్యలు, మంచినీటి సరఫరా పరిస్థితులను పరిశీలించడంతో పాటు సున్నం చెరువు అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు.

డ్రైనేజీ పనుల్లో జాప్యంపై ఆగ్రహం

డివిజన్‌లో డ్రైనేజీ పనులు నత్తనడకన సాగుతుండటంపై ఎమ్మెల్యే అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. పనులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహించకుండా, నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

సున్నం చెరువు అభివృద్ధికి వేగం పెంచాలి

సున్నం చెరువు అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే, పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వసతులు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనుల విషయంలో జాప్యం జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.

మంచినీటి సమస్యకు పరిష్కారం చూపాలి

అల్లాపూర్ డివిజన్‌లో మంచినీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్న ఎమ్మెల్యే, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి సమస్య ఎదురైనా తక్షణమే అందుబాటులో ఉంటూ, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో మాజీ కార్పొరేటర్ సబియా గౌసుద్దీన్, మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్ గౌసుద్దీన్, డివిజన్ అధ్యక్షుడు ఐలయ్య, తిరుపతి, వీరారెడ్డి, బాబా, జిలాని, జగన్నాథము, రీయాజ్, నూర్, సంబంధిత అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ కళాకారుల హక్కుల సాధనే లక్ష్యంగా తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ

కళాకారుల అభ్యున్నతికి ఇండస్ట్రీ కృషి.. సిరిసిల్ల వేదికగా ప్రభుత్వానికి వినతి

హైదరాబాద్ నిలువుటద్దం ప్రతినిధి: తెలంగాణ కళాకారుల అభ్యున్నతి, హక్కుల సాధనే లక్ష్యంగా తెలంగాణ ఫోక్ అసోసియేషన్, తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఏర్పాటయ్యాయని తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ అధ్యక్షుడు పత్తిపాటి రమణాకర్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నవంబర్ 3వ తేదీన సిరిసిల్ల పట్టణ కేంద్రంలో తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో తెలంగాణ ఫోక్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ వేడుకల్లో తెలంగాణలోని అన్ని జిల్లాలకు చెందిన కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ కళాకారుల జీవితాల్లో ఆశించిన మార్పు రావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కళాకారులను కేవలం కార్మికులుగా మాత్రమే కాకుండా, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడే సాంస్కృతిక ప్రతినిధులుగా గుర్తించాలని కోరారు. తెలుగు సినీ పరిశ్రమ తరహాలో తెలంగాణ కళాకారుల కోసం ప్రత్యేకంగా తెలంగాణ ఫోక్ ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కళాకారులకు సంక్షేమ పథకాలు కల్పించాలి

తెలంగాణలో కళనే నమ్ముకుని జీవనం సాగిస్తున్న కళాకారులను ప్రభుత్వం గుర్తించి వారికి సామాజిక భద్రత కల్పించాలని నాయకులు కోరారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు.

- అర్హులైన కళాకారులకు నెలవారీ పెన్షన్ సదుపాయం కల్పించాలి.
- నిరుపేద కళాకారులకు ఇళ్ల స్థలాలు, గృహ వసతి కల్పించాలి.
- కళాకారుల ఆరోగ్య రక్షణ కోసం ప్రత్యేక ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేయాలి.
- నిరుపేద కళాకారుల పిల్లలకు ఉచిత విద్య అందించాలి.
- కళాకారుల సంక్షేమం కోసం ప్రత్యేక విధానాలను రూపొందించి, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలి.

తెలంగాణ సంస్కృతిలో కళాకారుల పాత్ర ఎంతో కీలకమని, వారి జీవనోపాధి, సంక్షేమం, భవిష్యత్తుపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని వారు విజ్ఞప్తి చేశారు.

కళాకారుల ఐక్యతతోనే హక్కుల సాధన

రాబోయే రోజుల్లో తెలంగాణలోని అన్ని జిల్లాల్లో తెలంగాణ ఫోక్ అసోసియేషన్, తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కళాకారుల న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వానికి చేరే వరకు ఐక్యంగా నిరంతర పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.తెలంగాణలోని కళాకారులందరికీ తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ సభ్యత్వం కల్పించేందుకు కృషి చేస్తున్నామని, 24 క్రాఫ్ట్‌లకు చెందిన కళాకారులందరూ తెలంగాణ ఫోక్ అసోసియేషన్‌లో సభ్యత్వం తీసుకోవాలని పిలుపునిచ్చారు. కళాకారులంతా ఐక్యంగా ఉంటే తమ హక్కులను సాధించుకోవచ్చని, వారి సంక్షేమం కోసం తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ నిరంతరం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ కార్యవర్గ సభ్యులు, గౌరవ సలహాదారు దరువు అంజన్న, అభినయ శ్రీనివాస్, గజ్వేల్ వేణు, కోదారి శ్రీనివాస్, మల్లిక్ తేజ, జ్ఞానేశ్వర్, కోదం సంతోష్, ఘనశ్యామ్, వస్పరి విష్ణు, సంతోష్, బోడ చంద్రప్రకాష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

'కాళంకి భైరవుడు' మూడో సింగిల్ టైటిల్ సాంగ్ విడుదల

రాకింగ్ స్టార్ మంచు మనోజ్ చేతుల మీదుగా పాట ఆవిష్కరణ

ఫిల్మ్ న్యూస్, నిలువుటద్దం: 'కాళంకి భైరవుడు' చిత్రంలోని మూడో సింగిల్ టైటిల్ సాంగ్‌ను రాకింగ్ స్టార్ మంచు మనోజ్ విడుదల చేశారు. రాజశేఖర్ వర్మ హీరోగా, పూజా కిరణ్, రితికా చక్రబోతి హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి హరిహరన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ పాట విడుదలతో సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరుగుతోంది. ఈ చిత్రానికి సంగీతాన్ని పెద్దపల్లి రోహిత్ (పి.ఆర్) అందిస్తుండగా, అశోక్ అన్నిబోయిన సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నారు. కిషోర్ ఎడిటింగ్, బీ. జగన్ ఆర్ట్ విభాగాలను నిర్వహిస్తున్నారు. రామ్ సుంకర ఫైట్స్ కంపోజ్ చేస్తున్నారు. కేఎన్ రావు, డాక్టర్ శ్రీనివాసరావు నిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి శోభన్ నవరాసుల కో-డైరెక్టర్‌గా, పల్లపు రాజు అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. దర్శకత్వ విభాగంలో బుడుగు శ్రీనివాస్, రమ్య యార్లపాటి, బాబు తమ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. మూడో సింగిల్ టైటిల్ సాంగ్‌ను మంచు మనోజ్ విడుదల చేయడంతో చిత్ర బృందం ఆనందం వ్యక్తం చేసింది. సినిమా విడుదలకు ముందే ఈ పాట ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని చిత్ర యూనిట్ ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

నిప్పులాంటి నిజాల ప్రతిబింబం
నిలువుటద్దం
శుక్రవారం 30-10-2026

రాహుల్ సభకు సంగారెడ్డి నుంచి ఢిల్లీ బయలుదేరిన కాంగ్రెస్ నాయకులు

కార్యకర్తల బస్సులను జెండా ఊపి ప్రారంభించిన జగ్గారెడ్డి.

సంగారెడ్డి , నిలువుటద్దం ప్రతినిధి : నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో జరిగే రాహుల్ గాంధీ బహిరంగ సభకు హాజరయ్యేందుకు సంగారెడ్డి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బస్సుల్లో బయలుదేరారు. సంగారెడ్డి ఐబీ వద్ద అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటి గంటకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి జెండా ఊపి బస్సులను లాంఛనంగా ప్రారంభించారు. సదాశివపేట మండలం నుంచి సీడీసీ చైర్మన్ రామ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సిద్దన్న, శ్రీనివాస్ యాదవ్‌లతో కలిపి మొత్తం 46 మంది బయలుదేరారు. కొండాపూర్ మండలం నుంచి ఆత్మ చైర్మన్ ప్రభు, నాయకులు నర్సింహారెడ్డి, మల్లారెడ్డిలతో కలిపి 26 మంది ఢిల్లీ పయనమయ్యారు. నిర్మల జగ్గారెడ్డి, భరత్ సాయిరెడ్డిలతో సహా సంగారెడ్డి నియోజకవర్గం నుంచి మొత్తం 150 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఈ సభకు హాజరుకానున్నారు. బస్సుల ప్రారంభ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, నాయకులు కూన సంతోష్, కిరణ్ గౌడ్, మహేష్ ముదిరాజ్, శ్రీహరి, సుదీప్, బబ్బు తదితరులు పాల్గొన్నారు.

కాలం -- అనుకూలం

ప్రతిరోజూ పంచాంగం తెలుసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు
శాస్త్రం ప్రకారం ప్రతిరోజూ పంచాంగం తెలుసుకోవడం వల్ల ఐదు ముఖ్యమైన ప్రయోజనాలు కలుగుతాయి.
తిథి: సంపదలు కలుగుతాయి. శుక్ల, కృష్ణ పక్షాల్లో కలిపి 15 తిథులు ఉంటాయి.
వారం: ఆయుష్షు పెరుగుతుంది. వారంలో ఏడు రోజులు ఉంటాయి.
నక్షత్రం: పాపాలు తొలగిపోతాయి. మొత్తం 27 నక్షత్రాలు ఉంటాయి.
యోగం: రోగ నివారణ కలుగుతుంది. మొత్తం 27 యోగాలు ఉంటాయి.
కరణం: కార్యసిద్ధి కలుగుతుంది. మొత్తం 11 కరణాలు ఉంటాయి.
ఓం శ్రీ గురుభ్యో నమః
అక్టోబర్ 30, 2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం
దక్షిణాయనం -- శరదృతువు
ఆశ్వయుజ మాసం -- కృష్ణ పక్షం
తిథి: పంచమి రాత్రి 11:41 గంటల వరకు. అనంతరం షష్ఠి తిథి ప్రారంభమై, అక్టోబర్ 31 రాత్రి 9:17 గంటల వరకు ఉంటుంది.
వారం: భృగువారం (శుక్రవారం)
నక్షత్రం: మృగశిర మధ్యాహ్నం 1:52 గంటల వరకు. అనంతరం ఆర్ద్ర నక్షత్రం ప్రారంభమై, అక్టోబర్ 31 మధ్యాహ్నం 12:04 గంటల వరకు ఉంటుంది.
యోగం: శివ యోగం రాత్రి 8:41 గంటల వరకు. అనంతరం సిద్ధ యోగం ప్రారంభమై, అక్టోబర్ 31 సాయంత్రం 5:31 గంటల వరకు ఉంటుంది.
కరణం: కౌలవ ఉదయం 8:46 గంటల వరకు, తైతుల రాత్రి 7:25 గంటల వరకు. అనంతరం గరజి కరణం ప్రారంభమై, అక్టోబర్ 31 ఉదయం 6:09 గంటల వరకు ఉంటుంది.
రాహుకాలం: ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు.
దుర్ముహూర్తం: ఉదయం 8:34 నుంచి 9:20 గంటల వరకు, మధ్యాహ్నం 12:22 నుంచి 1:08 గంటల వరకు.
వర్జ్యం: రాత్రి 9:38 నుంచి 11:07 గంటల వరకు.
అమృతకాలం: రాత్రి 9:57 నుంచి 11:25 గంటల వరకు.
సూర్యోదయం: ఉదయం 6:17 గంటలకు.
సూర్యాస్తమయం: సాయంత్రం 5:42 గంటలకు.
గురుబోధ
నవగ్రహాలకు ప్రదక్షిణలు చేయడం వల్ల భూమండలానికి ప్రదక్షిణ చేసిన ఫలితం లభిస్తుంది.
--- శ్రీ నారద పురాణం
దీపారాధన
దీపారాధనకు స్వచ్ఛమైన ఆవు నెయ్యి లేదా నువ్వుల నూనెను ఉపయోగించడం శ్రేష్ఠం.

మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, మంచి మార్గంలో నడవాలి

జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్.
సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలోని డీ-అడిక్షన్ సెంటర్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ
- ఎస్-నాబ్ ఆధ్వర్యంలో డీ-అడిక్షన్ సెంటర్‌కు ఇండోర్ స్పోర్ట్స్ మెటీరియల్ అందజేత.

సంగారెడ్డి , నిలువుటద్దం ప్రతినిధి; సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డీ-అడిక్షన్ సెంటర్‌ను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్, గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాలకు బానిసలైన వారిని ఆ వ్యసనం నుంచి బయటపడేలా చేసి, సాధారణ జీవితాన్ని గడిపేలా పునరావాసం (రెహాబిలిటేషన్), కౌన్సెలింగ్ ద్వారా వైద్యుల పర్యవేక్షణలో వారిలో మార్పు తీసుకురావడమే ఈ డీ-అడిక్షన్ సెంటర్ ప్రధాన ఉద్దేశమని ఎస్పీ తెలిపారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, చెడు అలవాట్లకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. జీవితంలో మంచి మార్గంలో నడుస్తూ తమ కుటుంబాలకు ఆదర్శంగా నిలవాలని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలన్నారు. ఈ సందర్భంగా ఎస్-నాబ్ ఆధ్వర్యంలో డీ-అడిక్షన్ సెంటర్‌కు ఇండోర్ స్పోర్ట్స్ మెటీరియల్‌ను అందజేశారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ పెంపొందుతాయని తెలిపారు. అనంతరం డీ-అడిక్షన్ సెంటర్ వైద్యులతో ఎస్పీ మాట్లాడి, కేంద్రానికి వచ్చే వారికి అవసరమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. వైద్యపరమైన జాగ్రత్తలు పాటిస్తూ, కౌన్సెలింగ్ ద్వారా మత్తు పదార్థాల వ్యసనం నుంచి బయటపడేందుకు ప్రయత్నిస్తున్న వారికి తగిన సహకారం, ప్రోత్సాహం అందించి, వారిలో సానుకూల మార్పు తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీలక్ష్మి, నోడల్ ఆఫీసర్, డాక్టర్ మురళీకృష్ణ, సూపరింటెండెంట్, డాక్టర్ రవికుమార్, ఆర్ఎంఓ, డాక్టర్ పద్మావతి, ఆర్ఎంఓ, ఎస్-నాబ్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్ రావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బాలాజీ నగర్‌లో గుమ్మడి రాజలింగం ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్నారులకు పుస్తకాలు, పెన్సిళ్లు పంపిణీ

విద్యాభివృద్ధే లక్ష్యంగా చిన్నారులకు చేయూత.....

హైదరాబాద్ సిటీ నిలువుటద్దం ప్రతినిధి, అక్టోబర్ 29: కూకట్పల్లి నియోజకవర్గం బాలాజీ నగర్‌లో గుమ్మడి రాజలింగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్నారులకు పుస్తకాలు, పెన్సిళ్లు, ఇతర విద్యా అవసరమైన సామగ్రిని పంపిణీ చేయడం జరిగింది. విద్యార్థులకు చదువుపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు, ఆర్థిక ఇబ్బందుల కారణంగా విద్యకు దూరం కాకుండా చిన్నారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు అవసరమైన వస్తువులను అందించడం ద్వారా వారి విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించారు. ఈ సందర్భంగా గుమ్మడి రాజలింగు ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ గుమ్మడి కిరణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య అందుబాటులో ఉండాలని, విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పేద విద్యార్థులకు అండగా నిలవడం, వారి భవిష్యత్తుకు బాటలు వేయడం ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. "విద్య, వైద్యం, న్యాయం" అనే ప్రధాన ఆశయాలతో గుమ్మడి రాజలింగు ఫౌండేషన్ నిరుపేదలకు, విద్యార్థులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోంది. చిన్నారుల ముఖాల్లో చిరునవ్వులు నింపుతూ, వారి విద్యాభివృద్ధికి తోడ్పడిన ఈ కార్యక్రమం ద్వారా ఫౌండేషన్ సామాజిక బాధ్యతను చాటుకుంది.

నార్త్ సిటీ విద్యార్థుల ర్యాలీ

నీటిని వృధాచేయరదు అంటూ సూరారం ఎక్స్ రోడ్డు వరకు ర్యాలీ.
రవీందర్ ముదిరాజ్ అధ్యక్షతనలో
నీటిని వృథాగా పోకుండా చూసుకోవాలని తెలిపారు.

వర్షపు నీటిని కాపాడాలని ఇంకుడు గుంతలు తీయాలని, ఇంకుడు గుంత ఉంటేనే బోరు వేయడానికి అనుమతి ఇవ్వాలని,బోరు వేసేటప్పుడు వచ్చే నీరు బయట రాకూడదని నార్త్ సిటీ స్కూల్, కుత్బుల్లాపూర్,జోన్,సిఎంసి కార్పొరేషన్ మేడ్చల్ జిల్లా సూరారం లోని నార్త్ సిటీ విద్యార్థులు ర్యాలీ చేశారు.నీటిని వరద చేయరాదు అంటూ నినాదాలు చేస్తూ ఊరేగింపుగా ర్యాలీ నిర్వహించి,రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ,బంధువులు వచ్చినప్పుడు చిన్న గ్లాసులో నీళ్లు ఇస్తామని కూర్చోండి.స్నానం చేస్తామని వేస్టెన్ కుండీలో నీళ్లు వృధా పోకుండా,అందులో ఒక లీటర్ నీళ్ల బాటిల్ నీళ్లు నింపి వేయాలని,స్టీల్ ప్లేట్లు కాకుండా గ్రామాల నుంచి ఇస్తరాకులు తెచ్చి అందులో భోజనం చేయాలని చిన్న జగ్గుతో కూర్చొని స్నానం చేయాలని,నీటిని పొదుపుగా వాడలని,భారీ ర్యాలీ నిర్వహించి నర్సిటీ స్కూల్ విద్యార్థులు సామాజిక పర్యావరణ ప్రేమికులు కోల రవీందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో,విద్యార్థులు స్లోగన్ రవీందర్ ముదిరాజ్ సాక్షిగా విద్యార్థులు ప్రమాణం చేశారు. ఇంకుడు గుంతలు ఉంటేనే బ్యాంకులు రుణాలు ఇవ్వాలని, ప్లాట్లు ఇల్లు రిజిస్ట్రేషన్ చేయాలని, విద్యార్థులు డిమాండ్ చేయడం జరిగింది.భవిష్యత్తులో నీరు లేకపోతే మనుగడ సాధ్యం కాదని,ప్రతి వర్ష బొట్టును ఒరిసి పట్టుకోవాలని,నీటిని పొదుపుగా వాడాలని వీధుల గుండా విద్యార్థులచే ర్యాలీ నిర్వహించిన రవీందర్ ముదిరాజ్ పర్యావరణ ప్రేమికులు ఈ కార్యక్రమంలో సిఎంసి అధికారిని, పాఠశాల డ్రైవర్స్, తదితరులు పాల్గొన్నారు.

మటన్‌లోని ఈ పార్ట్ సూపర్ స్పెషల్..

వారానికి ఒక్కసారైనా తినండి.. శరీరం ఉక్కులా మారిపోద్ది..

మటన్ తిల్లి అంటే మేక ప్లీహం. ఇందులో ప్రోటీన్, ఐరన్, విటమిన్ బి12 వంటి పోషకాలు ఉంటాయి. వీటిని మితంగా ఆహారంలో చేర్చుకోవడం వల్ల ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి, కండరాల పనితీరుకు అవసరమైన పోషకాలు అందవచ్చు. ఉల్లిపాయలు, కారం, అల్లం వెల్లుల్లి, మసాలాలతో తిల్లి ఫ్రైని రుచిగా తయారు చేసుకోవచ్చు. వీకెండ్ వచ్చిందంటే చాలు నాన్‌వెజ్ ప్రియుల ఇళ్లల్లో చికెన్, మటన్ ఉడకాల్సిందే.. కర్రీ, ఫ్రైతోపాటు.. పలు రకాలుగా వండుకుని తింటారు.. అయితే.. ముఖ్యంగా మటన్ బలమైన మాంసాహారం.. దీనిలో ప్రోటీన్ తోపాటు అనేక పోషకాలు దాగున్నాయి.. అయితే.. మేక -- గొర్రె మాంసంలో అన్ని భాగాలు ప్రత్యేకమైనవే.. మాంసంతోపాటు.. తలకాయ, కాళ్లు, లివర్, తిల్లి, బోటి.. ఇలా అన్ని ఎన్నో పోషకాలతో నిండి ఉన్నాయి.. బలమైన ఆహారంలో తిల్లి ఒకటి.. దీనిలో అనేక పోషకాలు దాగున్నాయి.. మటన్ తిల్లి (మేక స్ప్లీన్) శరీరంలో రక్తాన్ని పెంచడానికి, రక్తహీనతను తగ్గించడానికి ఉపయోగపడే అత్యంత పోషకమైన ఆరోగ్యకరమైన ఆహార పదార్థమని ఆహార నిపుణులు చెబుతున్నారు.

తిల్లిలో ఎన్నో పోషకాలు..

మటన్ తిల్లిలో ఐరన్, ప్రొటీన్లు, విటమిన్ బి12 పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్తహీనతను నివారిస్తాయి.. అంతేకాకుండా.. కండరాల బలానికి, శరీర కణాల మరమ్మతుకు అవసరమైన నాణ్యమైన ప్రొటీన్లు ఇందులో లభిస్తాయి. ఇంకా నరాల ఆరోగ్యానికి, ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి సహాయపడుతుంది. మటన్ తిల్లి ఫ్రై, లేదా మేక ప్లీహముతో చేసే ఈ రుచికరమైన వంటకం కేవలం నోరూరించే భోజనమే కాదు, ఆరోగ్య ప్రయోజనాల గని కూడా.. సాధారణంగా నెరడా ఫ్రై అని కూడా పిలువబడే ఈ వంటకం, శరీరాన్ని బలోపేతం చేసే ఐరన్, ప్రొటీన్, ఇతర ముఖ్యమైన పోషకాలతో నిండి ఉంటుంది. మటన్ టిల్లిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల రక్తహీనత వంటి సమస్యలను నివారించవచ్చని, ముఖ్యంగా రక్తస్థాయిని పెంచడంలో ఇది అద్భుతమైనదని పెద్దలు పేర్కొంటుంటారు..

మటన్ తిల్లి ఫ్రై తయారీ విధానం:

ఈ పోషకభరితమైన వంటకాన్ని తయారుచేయడం చాలా సులభం.

ముందుగా ఒక పాన్‌లో నూనె వేడి చేసి, సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు, మధ్యలోకి చీల్చిన పచ్చిమిర్చి వేసి బంగారు రంగు వచ్చేవరకు బాగా మగ్గించుకోవాలి.

ఉల్లిపాయలు మగ్గిన తర్వాత, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి, పచ్చి వాసన పోయేంత వరకు వేగించాలి.

శుభ్రం చేసి పెట్టుకున్న మటన్ టిల్లి, మటన్ లివర్, కిడ్నీ ముక్కలను వేసి బాగా కలిసేలా కలుపుకోవాలి. ఈ ముక్కలు సుమారు పావు కిలో వరకు ఉండవచ్చు.

కొద్దిగా పసుపు, తగినంత ఉప్పు వేసి, బాగా కలిపి, మూత పెట్టి కొద్దిసేపు మగ్గనివ్వాలి. దీనివల్ల మాంసం ముక్కలు తమలోని నీటిని విడుదల చేసి, పాక్షికంగా ఉడుకుతాయి.

మాంసం కొద్దిగా మగ్గిన తర్వాత, మీ రుచికి సరిపడా కారం (రెండు టీస్పూన్ల వరకు) వేసి బాగా కలపాలి.

మాంసం ఉడకడానికి సరిపడినంత నీళ్లు పోసి, మళ్లీ మూత పెట్టి, మాంసం పూర్తిగా మెత్తబడే వరకు ఉడికించుకోవాలి.

చివరగా, కొద్దిగా కరివేపాకు, ఒక టీస్పూన్ ధనియాల పొడి, ఒక టీస్పూన్ గరం మసాలా పొడి వేసి బాగా కలపాలి.

మీరు కర్రీ లాగా కావాలంటే ఈ దశలో వడ్డించవచ్చు.. కానీ కొంచెం దగ్గరికి, ఫ్రై లాగా కావాలంటే ఇంకొంచెం సేపు మూత పెట్టి ఉడికించాలి. దీనివల్ల రుచి మరింత పెరుగుతుంది. చివరిగా తరిగిన కొత్తిమీరతో గార్నిష్ చేసి వేడి వేడిగా వడ్డించండి.

ఆరోగ్య ప్రయోజనాలను పొందడానికి, మటన్ టిల్లి వంటి ఆర్గాన్ మీట్లను మితంగా తినాలి. వీటిలో ప్రొటీన్ శాతం ఎక్కువగా ఉండటం వల్ల త్వరగా కడుపు నిండిన అనుభూతి కలుగుతుంది.

ఈ మటన్ టిల్లి ఫ్రై కేవలం రుచిని అందించడమే కాదు, మీ శరీరానికి అవసరమైన పోషకాలను అందించి, ఆరోగ్యాన్ని పెంపొందించడంలో సహాయపడుతుంది. రక్తహీనతతో బాధపడేవారు లేదా తమ రక్తస్థాయిని పెంచుకోవాలనుకునేవారు ఈ వంటకాన్ని తప్పకుండా ప్రయత్నించాలి. అయితే.. ఏమైనా సమస్యలుంటే ముందుగా ఆరోగ్య నిపుణులను సంప్రదించడం మంచిది.